# 'స్థితప్రజ్ఞత'

సుఖ దుఃఖాల్ని సమంగా చూట్టం అందరికీ సాధ్యపడుతుందా? చాలామంది కది అసాధ్యం. సుఖాల్లో కేరింతలు కొట్టడం, దుఃఖంలో కుంగిపోవడం చాలా సహజం. మనకు సుఖాలో దుఃఖాల్లో ఒకేలా బ్రతికేవారు తారసపడినపుడు ఆశ్చర్యపోతాం. కుతూహలంగా వారి జీవనశైలిని గమనిస్తాం.

అట్లాంటి దంపతుల్ని పరిచయం చేస్తా నీ వారం...

ఓడలు బళ్లు కావడం... బళ్లు ఓడలు కావడం అన్న సామెతను నిజం చేసినవారీ దంపతులు.

అట్లా బండి అయిన ఓడలాంటి వ్యక్తి రామచంద్రయ్య.

అతను ఓడలా వున్నప్పుడు చుక్కానిగానూ... బండి అయినప్పుడు కాడిగానూ వున్న ఆయన సహచరి అన్నపూర్ణమ్మ.

రామచంద్రయ్యగారు డిగ్రీ తర్వాత సినిమాటోగ్రఫీలో శిక్షణ పొందారు. విజయవాహినీ సంస్థ మెట్లెక్కారు. ఆ సంస్థకు ప్రధాన సినిమాటోగ్రాఫరు మార్కస్ బార్లే... దిగ్గజం...ఆయన అసిస్టెంటుగా ఉద్యోగం యిచ్చారు విజయవాహిని వారు రామచంద్రయ్యకు. ఇప్పటికీ పాత సినిమా టైటిల్సులో రామచంద్రయ్యగారి పేరు చూడొచ్చు మనం.

సరే మంచి సంస్థ. గొప్ప గురువు అన్నిటికీ మించి మంచి జీతం. జీవితం సుఖమయంగా సాగిపోతోంది.

సినిమాల్లో డబ్బు గురించి చెప్పనవసరంలేదు. వస్తే కుప్పలు తెప్పలుగా వస్తుంది. పోయినా అట్లాగే పోతుంది.

అసిస్టెంటుగా జీవితం సుఖంగానే ఉన్నా విలాసవంతంగా లేదు. రామచంద్రయ్యకు అసిస్టెంటుగా ఎడిటింగ్, డైరెక్షను శాఖల్లో వాళ్లతో పరిచయాలు పెరిగాయి. ప్రతి రంగంలో కులాల వారీగా జట్లు కట్టినట్లే, ఈయన కులం వాళ్లంతా కల్సి ఓ జట్టు కట్టారు. సరే బాగానేవుంది. గ్రూపు సొంతం అసిస్టెంట్లుగానే ఏమిటి మనకు మనం ప్రమోషన్లిచ్చుకుందాం. మనమే నెం.1 అయిపోదాం అని నిర్ణయించు కున్నారు. అది కూడా బాగానే వుంది. అక్కడితో ఆగితే సరిపోయేది. మనకు మనమే ప్రొడ్యూసర్లు కూడా అయిపోదాం అని నిర్ణయం! ఇక్కడ మొదలైంది అసలు కథ.

ఉన్న ఆస్తులు అమ్ముకున్నారు. డబ్బు పోగు చేసుకున్నారు.

సొంత బ్యానర్ మీద మూడు సినిమాలు తీసారు. మూడింటికి మూడూ 'ఢాం' గ్రూపు విడిపోయింది.

ఇద్దరు కొడుకులూ, ఒక కూతురూ భార్యతో రామచంద్రయ్య రోడ్డుమీద... అయితే ఆయన మొక్కవోలేదు. అన్నపూర్ణమ్మగారు కూడా ధైర్యం చెప్పారు. సినిమారంగం నించీ దూరంగా వచ్చేస్తారు.

ఆయన కాఫీ విత్తులు తేవడం... ఇంట్లో వేయించి మర ఆడించి (చేతిమర) పొట్లాలు కట్టడం... ఆవిడ వడియాలూ అప్పడాలూ, మజ్జిగ మిరపకాయలూ వేయడం, బుట్టలల్లడం... ఇల్లిల్లూ వాకిలి వాకిలీ... హోటళ్లూ, కిళ్లీబడ్డీలు తిరగడం... కెమెరా పట్టిన చేత్తో రామచంద్రయ్య కాఫీ మర తిప్పడం... ఆవిడ వంచిన నడుమెత్తకుండా వడియాలూ, అప్పడాలూ పెట్టడం... అప్పట్లో మద్రాసులో చాలా మంది తెలుగువాళ్లింట్లో అన్నపూర్ణమ్మ గారి వడియాలూ, అప్పడాలూ ఖచ్చితంగా వుండేవి. ఇలా ఉంటే బంధువుల కుర్రాడు చదువుకు మద్రాసొచ్చాడు. మీ ఇంట్లో వుంటూ పేయింగ్ గెస్టులాగా డబ్బిస్తానన్నాడు. "మేం వండుకున్నది నీకు పెట్టడానికి డబ్బు తీసుకోనవసరంలేదు నాయనా" అని అతని చదువయ్యే వరకు ఇంట్లో వుంచుకున్నారా దంపతులు.

ఇప్పుడా దంపతులిద్దరూ స్వర్గస్తులు.

ఇదెందుకు చెబుతున్నానో ప్రత్యేకం చెప్పనవసరం లేదు కదా! కష్టాలందరికీ వస్తాయి. ఎదుర్కొని పోరాడ్డమే కదా జీవితం!

* * *

***"ఒకచో నేల పవ్వళించు, నొకచో నొప్పారు బూసెజ్జపై, నొకచో శాకములారగించు, నొకచోను త్రుప్త శాల్యోదనం బొకచో బొంత ధరించు, నొక్కక్కతరిన్ యోగా యంబరశ్రేణి, లెక్కకు రానీయడు కార్యసాధకుడు. దుఃఖంబున్ సుఖంబున్ మదిన్" - భర్తృహరి***

***వీరుడైనవాడు ఎక్కడైనా పడుకోవచ్చు. ఏమైనా తినవచ్చు. ఏమైనా కట్టవచ్చు. ఏ స్థితినైనా ఒక్కలాగే చూస్తాడని కదా అర్థం-●***